క్లుప్తంగా

కేశవస్వామి కల్యాణోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

తాళ్లరేవు: స్థానిక కేశవపురం గ్రామంలో వేంచేసియున్న పురాతన శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీ కేశవస్వామివారి కల్యాణోత్సవాల కరపత్రాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆవిష్కరించారు. వచ్చేనెల 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులందరూ తరలిరావాలని ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు కోరారు.

ఘనంగా పోలేరమ్మ తీర్థం


విశేషాలంకరణలో పోలేరమ్మవారు

యానాం: నియోజకవర్గ పరిధిలో కనకాలపేట గ్రామంలో కొలువైన పోలేరమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు తరలివచ్చారు. భక్తులు కోరిన కోర్కెల తీర్చే దేవతగా పోలేరమ్మవారిని భక్తులు విశేషంగా ఆరాధిస్తారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారిని విశేషంగా అలంకరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పోలేరమ్మయూత్, శ్రీకోదండరావ, పోలేరమ్మ దేవస్థాన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర జరిగింది.

మండపేటలో నేడు జాబ్‌మేళా

అమలాపురం రూరల్: అలమూరులో కృష్ణ ప్రభాస్ పేపర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ట్రైనీస్ పేపర్ మేకింగ్ ప్రాసెస్ ఎల్రక్టానిక్ బాయిలర్ ఆపరేటర్స్ 23 పోస్టులు కేవలం బాలురతో భర్తీ చేయడానికి బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఎస్వీపీఆర్ఎం ఐటీఐ మండపేటలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఈ. వసంతలక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐటీఐ లేదా ఏదైనా ట్రేడ్ డిప్లమా బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ అర్హత ఉండి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉండాలన్నారు. ఆలమూరు మండలం పినపళ్ళలో పనిచేయాల్సి ఉంటుందని, జీతం రూ.12,000 నుంచి రూ.16,000 వరకు ఉండి క్యాంటీన్ సదుపాయం ఉందని ఈపీఎస్, ఈఎస్ఐ సౌకర్యాలు ఉన్నాయని ఆమె తెలిపారు.

ఘనంగా మురుగులమ్మ జాతర

అమలాపురం రూరల్: మండలంలో బండారులంక గ్రామంలో వేంచేసిన గంగాదేవి మురుగులమ్మ అమ్మవారి జాతర తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం రాత్రి అమ్మవారి జాగరణ ఘనంగా నిర్వహించారు. మంగళవారం తీర్థ మహోత్సవం నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా మురుగులమ్మ అమ్మవారికి గ్రామంలోని అన్ని కులాల వారు తమకు కేటాయించిన రోజుల్లో అమ్మవారి జాతర సేవలు వైభవంగా నిర్వహించారు. 10 రోజులుగా ఈ ప్రత్యేక సేవా కార్యక్రమాలను చూడడానికి భక్తులు కొన్నిరోజులుగా వేలాదిగా తరలివచ్చారు. సారస్కృతిక కార్యక్రమాలు, బుట్ట బొమ్మలు, వేషధారణలు, భారీ బాణసంచా విశేష ఆకర్షణగా నిలిచాయి. దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన జాతర మ్యూజికల్ ఆర్కెస్ట్రా, కోయ డ్యాన్సులు, బాణసంచా కాల్పులతో ఘనంగా జరిగింది. మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ప్రీమియం క్రికెట్ లీగ్‌కు రూ.20 వేలు అందజేత

అమలాపురం టౌన్: స్థానిక సావరంలో జరుగుతున్న ప్రీమియం లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలకు సంబంధించి ప్రథమ బహుమతి కోసం గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే వెంకట రమణారావు రూ.20 వేలు సమకూర్చారు. ఈ నగదును నిర్వాహకులకు మంగళవారం అందజేశారు.

ఆర్టీసీ కార్మికుల దీక్షలు


డిపోలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అమలాపురం రూరల్: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ డిమాండ్ల సాధనకు యునైటెడ్ వర్కర్స్, నేషనల్ మజ్దూర్ యూనియన్లు సంయుక్తంగా అమలాపురం ఆర్టీసీ డిపోలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించాయి. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, రిక్రూట్మెంట్ జరపాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి, నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు ఎండీ ఔలియా మాట్లాడారు.

అసిస్టెంట్ పరీక్ష కీ విడుదల

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగాఉన్న 256 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 27 నిర్వహించిన ఫస్ట్ ఫేజ్ రాతపరీక్ష కీ మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ విడుదల చేశారు. యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్‌లలో 84 సెంటర్లలో జరిగిన పరీక్షకు 32,830 మంది అభ్యర్థులకు గాను 22,830 మంది హాజరయ్యారు. 100 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్ష కీ ని వెబ్‌సైట్‌లో ఉంచారు. త్వరలో ఫలితాలు విడుదల చేస్తారు.

అధ్వానంగా గ్రామీణారోగ్యం

- నిర్వహణకు దూరంగా విలేజ్ హెల్త్ సెంటర్లు
- చెల్లాచెదురుగా పడిఉన్న కాలం చెల్లిన మందులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


తలుపులకు తాళాలు లేని మొల్లేటిమొగ విలేజ్ క్లినిక్


మొల్లేటిమొగ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో చెదలు పట్టిన మందులు

కాట్రేనికోన: గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే తపనతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోనూ గ్రామీణ హెల్త్ క్లినిక్ సెంటర్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. వీటిలో కొన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి గ్రామీణ ప్రజలకు చేరువ చేశారు. మండలంలో పల్లంకుర్రు సబ్ సెంటరు పరిధిలో కొత్తపాలెం, మొల్లేటిమొగ, కాట్రేనికోన సబ్ సెంటర్ పరిధిలో తిమ్మాపురం హెల్త్ సెంటర్లను మోడల్‌గా నిర్మించారు. ప్రతి విలేజ్ హెల్త్ సెంటర్‌లోను సీహెచ్ఓ, ఏఎన్ఎం, ఆశ, హెల్త్ అసిస్టెంట్స్ అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రతి విలేజ్ హెల్త్ సెంటర్‌లోను రోగులకు అవసరమైన అత్యవసర మందులను అందబాటులో ఉంచారు. మండలంలో పల్లంకుర్రు సబ్ సెంటరు పరిధిలో 9 విలేజ్ హెల్త్ సెంటర్లుకు మొల్లేటిమొగ, కొత్తపాలెం సొంత భవనాలు, కందికుప్ప–2, ఐ చెరువు హెల్త్ సెంటర్లు తుపాను షెల్టర్లలోను, మిగిలిన ఐదు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. కాట్రేనికోన సబ్ సెంటర్‌లో తిమ్మాపురం నూతన భవన నిర్మాణం జరుగుతుండగా, చిర్రయానం, చెయ్యేరు పాత సొంత భవనాలలోను, మిగిలిన ఎనిమిది అద్దె భవనాలలో నడుస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యంతో...

గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే ధ్యేయంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి శివారు ప్రాంతాలు, కొత్తపాలెం మొల్లేటి మొగ ప్రాంతాలలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానంగా ఉన్నాయి. శివారు ప్రాంత ప్రజలకు అత్యవసర మందులు అందుబాటులో ఉన్నా రోగులకు అందించిన దాఖలాలు లేవు. కాలం చెల్లిన మందులు చెల్లా చెదురుగా పడవేసి ఉన్నాయి. కనీసం మందులు పరిరక్షించే సిబ్బంది లేక కిటికీలు నుంచి వచ్చే వర్షపు జల్లులకు చెదలు పట్టిపాడయ్యాయి. క్లినిక్‌లోని గదులలోను, కిటికీలు, మరుగుదొడ్లలో సైతం మందులు పడిఉన్నాయి. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటే మందులను రోగులకు అవసరాలను బట్టి సరఫరా చేసేవారు. అసలు సిబ్బంది ఎప్పుడు వస్తారో గ్రామస్తులకు తెలియని పరిస్థితి దాపురించింది.

పగిలిపోయిన కిటికీ అద్దాలు

కొత్తపాలెం, మొల్లేటి మొగ హెల్త్ క్లినిక్ సెంటరుకు తాళం వేయక తలుపులు తెరిచి ఉండటంతో ఆకతాయిలు ఆగడాలు అధికంగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మందులు చెల్లా చెదురుగా పడి ఉండడమే కాక కిటికీ అద్దాలు సైతం పగిలిపోయి ఉన్నాయి. వైద్య సేవలు మాటెలా ఉన్నా కనీసం హెల్త్ సెంటరుకు తాళం వేసే సిబ్బంది లేకపోవడం పై స్థానికులు మండి పడుతున్నారు.

> **ఇంటింటికీ సిబ్బంది**
>
> గ్రామ స్థాయిలో ఆరోగ్య సర్వేతో ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లవలసి ఉంటుంది. అందులో భాగంగా ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళుతున్నారు.
>
> – గౌతమి, వైద్యాధికారిణి, పల్లంకుర్రు పిహెచ్‌సీ

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

తాళ్లరేవు: మహిళలందరూ చట్టాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక భీమాబాయి మహిళా మండలి కార్యాలయంలో సంఘ అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధనం ఆధ్వర్యంలో లింగ సమానత్వం, లింగ ఆధారిత హింస, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన, స్వయం సహాయక బృందాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ బాలికలు, మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలన్నారు. సమస్యలు వచ్చినపుడు వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. భీమాబాయి మహిళా మండలి కోశాధికారి పి.రత్నకుమారి మాట్లాడుతూ మహిళలపై హింసకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది వీఎం ఘౌస్ మహిళా రక్షణ చట్టాలైన గృహహింస నిరోధక చట్టం, నిర్భయ చట్టాలను వివరించారు. కానిస్టేబుల్స్ గౌతమి, లీలాధర్, వీఓఏ నాయకులు ఈశ్వరీబాయి, రమణ, మహిళా మండలి కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట్ నిర్వహణపై సమావేశం


నీట్ నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాం జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష కేంద్రంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 4న జరుగనున్న మెడికల్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్) నిర్వహణపై మంగళవారం స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోజు పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు.బాలికలు 104, బాలురు 30 మంది పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం పరీక్షాకేంద్రం గేట్లు ఉదయం 11 గంటలకు తెరుస్తారని 1.30 కు మూసివేస్తారన్నారు. పరీక్షకు వచ్చేటప్పుడు అభ్యర్థులు తమ వెంట ఆధార్, పాన్, డ్రైవింగ్‌లైసెన్స్ అందులో ఏదైనా ఒకటి, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. సాధారణ దుస్తులు ధరించాలని, మెటల్‌బటన్స్, బంగారు ఆభరణాలు, ధిక్ సాండల్స్‌ను, స్మార్ట్‌ఫోన్, ఎల్రక్టానిక్ వస్తువులు, హ్యాండ్ బ్యాగ్, బెల్ట్, క్యాప్, కాలుక్యులేటర్, స్కేల్, రబ్బరు ఏవీ అనుమతించరన్నారు. ఎన్‌టీఏ అధికారులు, గుర్తింపు పొందిన అధికారులు, డీఎల్‌సీసీ సభ్యులను తప్ప ఎవరికీ పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. సీసీ కెమెరాలు, జామర్స్ అమర్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖాధికారి లక్ష్మణ్ ప్రవీణ్, జీజీహెచ్ డీడీ రవిశంకర్, సీఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి దీటైన జవాబు చెప్పాలి



యానాంలో సాగిన కొవ్వొత్తుల ర్యాలీ

యానాం: జమ్మూ కాశ్మీర్‌లో పహల్‌గాంలో నిరాయుధులైన పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని పొట్టన పెట్టుకున్న ముష్కరులను తుదముట్టించాలని ఉగ్రదాడికి కేంద్ర ప్రభుత్వం దీటైన జవాబు చెప్పాలని పలువురు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మృతులకు ఆత్మశాంతి కలగాలని ఆకాంక్షిస్తూ యానాం వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక చిన్నాసెంటర్ నుంచి ఉగ్రదాడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆర్ఏఓ ఆఫీసు వరకు కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగింది. వర్తక సంఘ అధ్యక్షుడు నల్లా వెంకన్న, గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, సెక్రటరీ కాపగంటి గోపాలకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, మంచాల సాయికుమార్, అర్ధాని దినేష్, కాకి నాగేశ్వరరావు, చినరాజు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి


ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ ఊర్మిళాదేవి తదితరులు

ఉప్పలగుప్తం: సేంద్రియ వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించి ఆరోగ్యంగా జీవించాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి పంచాయతీ పరిధి గోకనవిల్లిలో ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ర్యాలీలో సర్పంచ్ మంగళవారం పాల్గొన్నారు. ఖరీఫ్ సాగులో కొంత భాగాన్ని సేంద్రియంగా చేసుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని సాగించాలని ఆమె రైతులకు సూచించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఎస్ఎఫ్ఎంటీ ఎం.సూరిబాబు, కె.మల్లికార్జునరావు, కేసీఆర్పీలు గుండుమోగుల రామకృష్ణ, జ్యోతి, పాటి రమణ, ఎమ్.రమేష్, కోలా గౌరీ, దేవి పాల్గొన్నారు.

12న మాలల మహా రణభేరి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

అమలాపురం టౌన్: వచ్చే 12న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో కాకినాడలో మాలల మహా రణ భేరి నిర్వహిస్తున్నట్లు జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ ఎంఏకే భీమారావు తెలిపారు. మాలల మహా రణభేరికి సంబంధించిన కరపత్రాలను స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో మంగళవారం రాత్రి మాల మహానాడు నాయకులు ఆవిష్కరించారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తూ ఆర్డినెన్స్ ఇచ్చినందుకు నిరసనగా ఈ రణభేరిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు పెయ్యల పరశురాముడు, పెనుమాల చిట్టిబాబు, కుంచే బాబులు, నాతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విలువలున్న నేత చిట్టబ్బాయి

- వైఎస్సార్ సీపీ అమలాపురం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్
- 4వ వర్ధంతిలో కోనసీమ నేతల ఘన నివాళి


చిట్టబ్బాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్లు డాక్టర్ శ్రీకాంత్, శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: తాను నమ్మిన సిద్ధాంతాలతో ఎన్నడూ రాజీ పడకుండా, నీతి నిజాయితీతో ఎదిగిన కుడుపూడి చిట్టబ్బాయి రాజకీయ విలువలున్న నేత అని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే దివంగత కుడుపూడి చిట్టబ్బాయి 4వ వర్ధంతి సందర్భంగా అమలాపురంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ ప్రసంగించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కార్యక్రమంలో పాల్గొని దివంగత చిట్టబ్బాయికి ఘన నివాళులర్పించారు. అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ నేతలు, కోనసీమలోని చిట్టబ్బాయి అభిమానులు తొలుత స్థానిక హైస్కూలు సెంటరుకు చేరుకున్నారు. అక్కడ నుంచి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాదయాత్రగా బయలుదేరి స్థానిక గడియారం స్తంభం సెంటరు సమీపంలో గల దివంగత చిట్టబ్బాయి విగ్రహం వద్దకు చేరుకున్నారు. చిట్టబ్బాయి తనయుడు, పార్టీ నేత కుడుపూడి భరత్ భూషణ్, రాష్ట్ర దృశ్య కళల అకాడమి మాజీ చైర్‌పర్సన్ సత్య శైలజ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్ధంతి కార్యక్రమంలో నేతలంతా చిట్టబ్బాయి సేవలను స్మరించుకుని నినాదాలు చేశారు. అనంతరం అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు డాక్టర్ శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు దివంగత చిట్టబ్బాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అమలాపురం, అల్లవరం, అంబాజీపేట ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, అమలాపురం, అంబాజీపేట జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, బూడిద లక్ష్మి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, పార్టీ సీనియర్ నాయకులు మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, వంటెద్దు వెంకన్నాయుడు చిట్టబ్బాయికి నివాళులర్పించారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- అధికారుల తీరుపై వైస్ ఎంపీపీ సురేష్ ఆగ్రహం
- మండల సమావేశం నుంచి వాకౌట్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాభవాని

ముమ్మిడివరం: మూడు సమావేశాల నుంచి పలు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చాం. అయినా వాటిని ఇప్పటి వరకు పరిష్కరించలేకపోయారు. ఇపుడు మళ్లీ సమావేశాలెందుకు అంటూ వైస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ కోలా గంగా భవానీ అధ్యక్షతన పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ టి.వెంకటాచార్య సమావేశంలో వివిధ శాఖల పనితీరును, ప్రగతిపై సమీక్ష నిర్వహించాలని అధికారులను కోరగా వైస్ ఎంపీపీ సురేష్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రజా ప్రతినిధులుగా సమస్యలపై తాము చర్చించకుండా అధికారుల సమీక్షలేమిటని ప్రశ్నించారు. ముందుగా మేము ప్రజా సమస్యలపై మాట్లడతామంటూ మైకు తీసుకుని పలు సమస్యలను ఏకరువు పెట్టారు. మూడు సమావేశాలలో పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చామని అయినా వాటిని పరిష్కరించలేదన్నారు. ముఖ్యంగా మంచినీటి సమస్యపై మాట్లాడుతూ అయినాపురం పెద మెట్టలంకలో జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి ట్యాంక్ నిర్మించారని ఇప్పటి వరకు మంచినీటి సరఫరా చేయలేక పోయారని ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. . దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వి.నానాజీ మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగలేదని వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించగా కాంట్రాక్టర్ బిల్లులు తీసుకుంటున్నారని అయినా పనులు ఎందుకు పూర్తి చేయలేదని సురేష్ ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పది రోజులలో సమస్యను పరిష్కరించగలమని అధికారి నానాజీ వివరించారు. పంచాయతీరాజ్ డీఈ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో పల్లెపండగ పథకం ద్వారా రూ.3.85కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 26 పనులు చేపట్టమన్నారు. 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధుల నుంచి మండలంలో రూ.136 కోట్లతో 71 పనులు చేపట్టామని వివరించారు. అయితే మండల స్థాయి ప్రజా ప్రతినిధి ఒకరు అయినాపురంలో పనులు పూర్తి చేయడంలో వివక్ష చూపుతున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వైస్ ఎంపీపీ సురేష్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఎంఈఓ ఆర్ ఉదయ భాస్కర్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి భవ్య, వివిధ శాఖాధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, వైస్ ఎంపీపీ–1 పామునాగవేణి పాల్గొన్నారు.

డీఎస్సీపై 2న అవగాహన సదస్సు

అమలాపురం టౌన్: యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మే 2వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు అమలాపురం యూటీఎఫ్ హోమ్‌లో డీఎస్సీ–2025పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీ సుబ్బారావు ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిష్ణాతులైన అధ్యాపక బృందం అభ్యర్థులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. సైకాలజీ మెటీరియల్ ఉచిత పంపిణీ చేస్తామని వివరించారు.

ఇద్దరు బైండోవర్

అల్లవరం: అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికార మద్యం విక్రయాలు నిర్వహించే ఇద్దరు పాత వ్యక్తులను అధికారులు బైండోవర్ చేశారు. అల్లవరం మండలంలో అనధికారికంగా మద్యం అమ్మకాలు నిర్వహించే అల్లవరం చెందిన బొక్కా తాతారావు, దేవగుప్తం చెందిన ఈతకోట రామకృష్ణ ఇద్దరు పాత ముద్దాయిలను అల్లవరం తహసీల్దార్ వద్ద మంగళవారం హాజరు పరిచినట్లు తెలిపారు. వారిని బైండోవర్ చేసినట్లుగా అమలాపురం సీఐ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. తహసీల్దార్ ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ష్యూరిటీ విధించినట్లు సీఐ తెలిపారు.

రేపటి నుంచి దుర్గాదేవి ప్రతిష్ఠా మహోత్సవాలు


జి.వేమవరంలో ప్రతిష్ఠించనున్న అమ్మవారి విగ్రహాలు

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం నుంచి 3వ తేదీవరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈ మహోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, మండపారాధన, గణపతి హోమం, శుక్రవారం గోపూజ, దీక్షా హోమాలు, క్షీరాధివాసం, ధ్యాన్యాధివాసం, శనివారం ఉదయం 10.08 నిమిషాలకు అమ్మవారి ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహిస్తామని ధర్మకర్త యర్రంనీడి నాగేశ్వరరావు, గుడి స్థలదాత లెంక రామన్నపాత్రుడు తెలిపారు.

కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తాము రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రెండో రోజు మంగళవారం ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మమత జ్యోతి, జిల్లావర్కింగ్ అధ్యక్షుడు ఏ.సాయి శంకర్, జిల్లా కార్యదర్శి,కె. సాయి తేజలు ఆధ్వర్యంలో జిల్లాలో పలు మండలాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఆందోళన చేపట్టారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, క్లినిక్ బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బి శివ, టీ.మనోహర్, జల్లి, వెంకటేష్ , సుమంత్. రాజీవ్ , జిల్లా ఉపాధ్యక్షుడు టి.రంగారావు, సాయి తేజ, శ్రీరామ్, హిమజ పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ సహకారంతో తాగునీటి సరఫరా


తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న సర్పంచ్

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న బోరుసు వారి వీధి, మేడిది వారి గ్రూపునకు మంగళవారం నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఓఎన్‌జీసీ సమకూర్చిన రెండు ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజు గ్రామస్థులకు 44 వేల లీటర్ల తాగునీరు అందిస్తామని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ తాగునీటి సరఫరాను సర్పంచ్ మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తులకు తాగునీరు అందించేందుకు ఓఎన్‌జీసీ ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీరు అందిస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు కోలా సత్యనారాయణ, తెలగారెడ్డి ఏసు, గ్రామ పెద్దలు, ఓఎన్‌జీసీ అధికారులు పాల్గొన్నారు.